# [illegible]

[కథ]

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౧

ఇది యిప్పటినాటి వృత్తాంతమని చెప్పలేను. కొన్ని వందల సంవత్సరముల క్రిందటిది కావచ్చును. వేలయేండ్లైయుండవచ్చును. లక్షల యబ్దములను గడచి యుండవచ్చును. కాక ఈనాటి కథయే కావచ్చును! ఇకముందు వందల సంవత్సరములకో, వేల సంవత్సరములకో, లక్షల యబ్దములకో జరుగనున్న దనియైన నన వచ్చును. ఎప్పటిదైన నేమి? ఈ కథ సత్యమైనది! ఎప్పటిదైనను ఈ కథాప్రారంభమునాటికి హిమాలయ పర్వతముల నుండి గంగా యమునా సరస్వతీ నదులు తప్ప మరి యే నదియు సముద్రుని జేరలేదు. భరతభూమికి ఉత్తరార్ధభాగమున పశ్చిమపు సరిహద్దు లేదు. సింధు నది యను నామమే జను లెవ్వ రెరుగరు.

౨

**హిమాలయపార్శ్వమున** గంగాతీరమున హరిద్వార మను మునిపల్లె యొకటున్నది. దాని కులపతి హరితకులోద్భవుడైన అంగిరస్సు. అందలి ఋషులు చేయు మహాసత్రముల యాజ్ఞికాగ్నిచే నానా డన్నుట శీతబాధ శమించి వాసయోగ్యముగా నుండెను. అంగిరస్సు ఇచ్ఛావిధేయులైన కింకరుల పరిరక్షచే నా చుట్టుపట్టుల దస్యుబాధ లేదు.

అంగిరస్సుపుత్రుడు అంబరీషుడు ఈమధ్యనే ఉపనీతుడై వేదాధ్యయనమునకై గురుకులము ప్రవేశించినాడు. అతనితో ఆటలాడి మరగిన యతని సోదరి పులోమకు భ్రాతృవియోగము దుస్సహమైనది. అన్నతో తిరుగాడిన ప్రదేశములే ఇప్పు డొంటరిగా తిరుగాడును. ఇప్పుడు వనస్పతుల నీడ లామెకు సుఖమీయవు. పర్వత సానువు లామెహృదయమును ఊర్ధ్వభాగములకు తీసికొని పోవు. గంగాతీరమున శిలలును, సైకతములును ఆమె చిత్తమునకు శాంతి కల్పింపవు.

రాజహంసములు, కారండవములు వినువీథి పంక్తులుగట్టి వెడలుచుండును. అవి కొన్ని వేళల ఉత్తరాభిముఖముగను, మరికొన్ని వేళల దక్షిణాభిముఖముగను ఆకాశగంగాప్రవాహమువలె ప్రసరించుచుండును. వానివంక చూచుచుండగా పులోమయూహలును ఆ హంసకారండవముల మార్గమునవే ఒకమా రటు, ఒకమా రిటు సంచరించుచుండును.

పితృదేవులకు మాధ్యాహ్నికపూజార్థము పూలు తెచ్చుటకు పులోమ బయలుదేరినది. పూ లుంచిన సోమరాకుసంపుటము చేత నుంచుకొని వెడలుచు, యన్నంబరీషునితో పవిత్రప్రసంగములు తరచుగా చేసిన ప్రదేశము దాపులో చేరినది. మందాకినీతీరము నంటియున్న యున్నతశిల యాప్రదేశమున గలదు. ప్రశాంతమగు నా స్థలము చేరగనే అంబరీషుని మాటలు జ్ఞప్తికి వచ్చును. తా నుపనీతుడైనంతట అగ్నికార్యము నిర్వర్తించుచు ఎంత బ్రహ్మవర్చస్సు సంపాదించగలనో యను నూహయే వాడు పలుమా రామెకు వర్ణించువాడు. వెంటనే యామెకును అగ్నిహోత్రవ్రతమే మధురభావముగా సుద్యోతించును.

పులోమ తన చేత నున్న యా పుష్పసంపుటము భూమిపై బెట్టి యా శిల నానుకొని కూర్చుండెను. ఆమె తలయెత్తగా ఆకసమున దక్షిణభాగమునుండి యొక రాజహంసమును, ఉత్తరదిశనుండి యొక కారండవమును వచ్చుచుండుట తిలకించెను. రాజహంసము ధీరగమనముతో వచ్చుచుండెను. కారండవము ఆతురమై బాణవేగముతో పరతెంచుచుండెను. ఆ రెంటిని చూచుచు నామె మనస్సు శూన్యభావము నొందెను. ఆ కారండవముఅరపు వినవచ్చుచుండెను.

ఆమె సమాధిసదృశావస్థకు ఆకస్మికముగా భంగము వాటిల్లెను. అపూర్వమైన యొక కేక యామె చెవుల బడినది. అది వరాహ ఘుర్ఘురము ననుకరించుచు భయంకరమై యుండెను. మ్లేచ్ఛుడు ఉచ్చరింప యత్నించు దేవవాక్కువలె నది కర్ణకఠోరముగా నుండెను.

పులోమ భయ మెరుగదు. కాని పరధ్యానముగా నున్న యామె ఆ యకస్మాద్దారుణశబ్దముచే ఉలిక్కిపడెను. కాలు సడలి ఘప్పుసంఘటనమునకు తగిలి యది మందాకినీప్రవాహములో పడెను. దానిని పట్టుకొనుటకు పులోమ చేతులు చాచుటలో యామె దేహము ఒరిగి మహావేగముతో ప్రవహించుచున్న యా మందాకినీప్రవాహము లోనికి జారి పడిపోయెను.

## 3

ఆ దారుణశబ్దము గావించిన వ్యక్తి ఆమెమాతృపక్షబంధువు. అతని పేరు పులోముడు. అతని తండ్రి దనువు అధికారతృష్ణచే హిమాలయపర్వతము దాటి ఉత్తరమున మానససరోవర ప్రాంతమందు నివాసము కల్పించుకొని యచ్చటి పార్వతీయులకు ప్రభువయ్యెను. వైదికాచారులకు దూరుడైనందున నతనికి, నతనివారలకును ద్విజకర్మలు నామమాత్రావశిష్టము లయ్యెను. ఆ ప్రభునామమునుబట్టి యా పార్వతీయులకుగూడ దానవనామము ప్రసిద్ధమైనది.

ఆ పార్వతీయులతో కలిసి పెరిగినందున పులోముని దేహము కూడ వ్యాయామకర్కశ మయ్యెను. బిగిసికొనిపోవు చలిదేశములలో బహుకాలము నివాసము చేసినందున నాతని చర్మము మనుష్యచర్మమువలె స్నిగ్ధముగా నుండక వరాహచర్మమువలె గరుకుబారినది. అతడు మాటాడునది దేవవాణియే. ఐనను చలికి మొద్దువారి సూక్ష్మమైన చలనములు మరచిన యా జిహ్వనుండి వెలువడుచుండుటచే నది యేదో క్రొత్తశబ్దముగా వినిపించుచుండెను.

అతడు తల్లిదండ్రులవెంట నా యుదయమునందే అంగిరస్సుల యాశ్రమమునకు వచ్చియుండెను. ప్రాతస్సంధ్యావందనము నిర్వర్తించుకొని పులోముడు ప్రొద్దుపోక సహవాసమునకై అన్వేషింప సాగెను. ముం దాతడు అచ్చటి విద్యార్థులలో కలసిపోవ ప్రయత్నించెను. కొందరు బ్రహ్మచారులు గురువులయొద్ద వేదపాఠము చెప్పుకొనుచుండిరి. వాడు వారి ప్రక్కను కూర్చుండెను. కాని గురువులు గాని, ఆ విద్యార్థులైనగాని అతనివంక తలయెత్తియైన తిలకింపలేదు. ఏమి యీ వింతవిద్యార్థులు! పార్వతీయులవలె లేవ్వు పలకరింపనైన పలకరింపక గురువు లుపదేశించు శ్రుతిపాఠము తదేకనిష్ఠతో అధ్యయనము చేయుచున్నారే!

పులోము డది భరింపలేక మరియొకచోటికి పోయెను. అక్కడ బ్రహ్మచారులుమాత్రమే కలరు. వా రంతకుముందే చెప్పికొనిన వేదపాఠము వల్లెవేయుచు మధ్యమధ్య ఒకరితో నొకరు సంభాషించుకొనుచుండిరి. ప్రక్కన గురువులు లేనందున పులోమునికి మరింత ధైర్యము కలిగి వారితో పోయి కూర్చుండెను.

ఈ నూతనయువకుడు వా రందరికంటె పెద్దవాడు. అందుచే వా రాతని నాదరించి వేదాధ్యయన మెంతవరకైన దని ముందు ప్రశ్నించిరి. ఉపనయనసంస్కారమే కాని యాత డధ్యయన మెరుగడు. అతనికి ఏమి ప్రత్యుత్తర మీయవలెనో తోచక కొంతసేపు వికటముగా నవ్వెను. ఇంకను వా రాతని మాటాడింప ప్రయత్నించిరి. వాడు చిన్న చిన్న జవాబులను, తక్కువని మాటిమాటికి నవ్వు నవ్వుటగాక వేరుసంభాషణము చేయలేదు. వారును తుద కా ప్రయత్నము వదలి వల్లించుకొనుచున్న పంక్తి కుపక్రమించుచు అతనిని కూడ కలిపి చెప్పుమని సాగించిరి.

ఆ బ్రహ్మచారులు అనర్గళముగా ఒక్కొక్క వాక్యమే పునః పునరావృత్తి చేసికొనుచు వల్లించుచుండిరి. వినగా వినగా పులోమున కది సులభసాధ్యముగా కనిపించెను. తుదకు ధైర్యము తెచ్చుకొని వాడును వారితో కలిపి చెప్ప ప్రారంభించెను. వా డట్లు రెండు మూడు వాక్యములైన చెప్పకముందే సంగీతములో అపశ్రుతివలెనే పాఠములో నపస్వరము లాతని నోట వచ్చెను. ఆ బ్రహ్మచారులు పంక్తి యాకస్మికముగా చాలించిరి. వారిలో పెద్దవాడు పులోముని కోపగించెను. చిన్నవా రాతని యపశబ్దోచ్చారణము ననుకరించుచు పరిహసించిరి.

ఆ పులోమదానవుని ముఖము సిగ్గుతో కందగడ్డవలె ఎఱ్ఱవారెను. నెమ్మదిగా కోప మావేశింపసాగెను. అతడు చివాలున నచ్చటనుండి లేచి ఆ యాశ్రమప్రదేశముల నిటునటు తారటలాడి అంగిరస్సుల ధర్మపత్నియొద్దకు పోయి అంబరీషు డెక్కడ నున్నా డని యడిగెను. అతడు వేదాధ్యయనమునకై గురుకులమునకు వెళ్ళినా డని యామె చెప్పగా విని, పులోమ యెక్కడ నున్నదని ప్రశ్నించెను.

"నీకు తోచుటయు లేదా నాయనా? అంబరీషుడు గురుకులమునకు వెళ్ళినప్పటినుండి తోడులేక అమ్మాయి దిగులుతో అక్కడక్కడ అడవులలోను, మందాకిని ఒడ్డునను పూలకోయు మిషతో వెళ్ళి తిరుగుచుండునురా!" అని యామె ప్రత్యుత్తర మొసగెను.

పులోముడు వెంటనే పులోమను వెదకుటకు ఒక్క పరుగున బయలుదేరెను. ఆ సంతోషపారవశ్యముతో క్షణకాలములో వా డా మునిపల్లెలో కుటీరము లున్న భాగ మతిక్రమించి బయటపడెను. అతని కది కారాగారమునుండి విడివడినట్లయ్యెను. అడవులలో దూరిపోవుట, శిలలపైనుండి లంఘించుట యతని కత్యంతసత్త్వమునకువలెనే బహుకాలాభ్యస్తమైనందున ఆశ్రమోపాంతభూమి యంతయు నామెకై వెదకుచు నా దానవు డుల్లాసముగా పరిభ్రమించెను.

అవలీలగా వా డట్లు గంతులు వేయుచు పోయిపోయి తుదకు మందాకినీతీరమున గండశిల నానుకొని ఆకాశమువంకకు తలయెత్తి అందు పారుచున్న హంసకారండవములను తిలకించెడి పులోమను ఉపలక్షించెను. సంతోషపారవశ్యముతో నా దానవుడు "పులోమా!" యని పెద్దపెట్టున కేక వేసెను. ఆ శబ్ద మాతని నాభిస్థానము కదలించుకొని పుట్టి, అతని రెండుపార్శ్వముల మధ్య గుహాంతరము పూరించి, కంఠకుహరిలో చేరి యినుమడించి, తాలుమధ్యప్రదేశము నిండిపోయి, పూర్తిగా తెరచిన యాతని ముఖవివరమునుండి తీవ్రవేగముతో వినిర్గత

మయ్యెను. ఆ మహాధ్వని యొక్క క్షణములో గిరికందరములను, మందాకినీజలములను మారుమ్రోగి మరింత భయంకరశబ్దముగా మారి పోయెను.

౪

**ఆ శబ్దము** వినియే పరధ్యానముగా నదియొడ్డున గూర్చున్న పులోమ ఉలిక్కిపడి మందాకినీప్రవాహములో పడిపోయినది. అది చూచినవెంటనే పులోమదానవుడును ముందువెనుక లాలోచింపక ఒక్కగంతు వేసి ఆ మహాప్రవాహములోని కురికెను.

పులోమ దేహము సుకుమార మయ్యును పటుత్వము కలది. చేపవలె నామెకును ఈత చిరకాలాభ్యస్తము. ఐనను అంత యాకస్మికముగా నామె త్రుళ్లి జారి నీటిలో పడిపోయినందునను, శీతలజల స్పర్శవలనను ఆమెయొడలు ఒక్కసారిగా జిల్లుమని కొయ్యవారి నిష్కంప మయ్యెను. ఆమె తెప్పరిల్లుకొని అంగచలనము ప్రారంభించు నప్పటి కప్పుడే యామెదేహము నొకసుడిగుండ మాకర్షించుచుండెను.

పులోమదానవు డీదుకొనుచు నామెను సమీపించునప్పటికి ఆమె యీదుచు నా సుడిలోనుండి తప్పించుకొనుటకు యత్నించు చుండెను. అట్లు ముమ్మా రామె యత్నించి ముమ్మా రామె సుడితో పాటు తిరుగుడుపడెను.

పులోము డది చూచి పెద్ద ఊపుతో తన దేహమును ముందుకు త్రోపుపెట్టుకొని పులోమను సూటిగా పోయి తాకెను. బలమైన యా త్రోపుతో వా రిద్దరు నాకస్మికముగా నా సుడివేగమునుండి బయటపడిరి. ఆ సుడియు ప్రక్క కొత్తిగిల్లెను. ఆ త్రోపులో పులోమదేహము పులోమదానవుని శిరస్సుపై బడెను. అత డంతట తన రెండు దీర్ఘబాహువులతో నామెశరీరమును పొదివెను. అట్లుండ మందాకినీ ప్రవాహవేగము వా రిద్దరను క్రిందికి లాగివేయుచుండెను.

ముప్పది బెండ్ల ప్రమాణము వా రట్లు కొట్టుకొని పోయిన పిమ్మట అదృష్టవశముచే పులోమదానవుని కాలికి నీటిలోనున్న యొక శిలపై పట్టు చిక్కెను. దానితో నాతడు పులోమకును ఒక్క క్షణము విశ్రాంతి యీయ గలిగెను. భూదేవిని సముద్రమధ్యమునుండి దంష్ట్రాకోటితో నుద్ధరించుచున్న యాదివరాహావతారునివలెనే పులోమ నుద్ధరించుచున్న యా పులోమదానవుని యాకారము ఆ ఒక్క క్షణకాలము భాసించెను.

వా రిద్దరు నంతట రొజుకొనుచు ఒడ్డు కీదుకొని రాగలిగిరి. ఒడ్డు చేరగానే పులోమ సొమ్మసిల్లిన ట్లయ్యెను. పులోమదానవుడును నీరుకారుచున్న తన వస్త్రములవంక నైన చూచుకొనక భస్త్రికవలె రొప్పుకొనుచు ఆ బాలిక వస్త్రములు పిండి తడియార్చి పాదములును, హస్తములును సంవాహన మొనర్చి యామెశరీరమునకు వేడి పుట్టించి తెలివి కలిగించెను. కొద్ది సేపటిలో పులోమకు నడచు నోపిక చేకూరి నది. పులోము డామెకు తన చేయూత యిచ్చి పట్టుకొని నెమ్మదిగా నడిపించుకొనుచు నాశ్రమమునకు తీసికొనిపోయి యామెను తల్లికి దర్శింపజేసెను.

మధ్యాహ్నదేవతార్చనవేళ యతిక్రమించిన చాల సేపటికి పులోమ పూలులేకుండ వట్టి చేతులతో వచ్చుట చూడ తల్లి కాశ్చర్య మయ్యెను. మరియును ఉత్తరక్షణములో నామెవాలకము చూచి వ్యగ్రచిత్తముతో ఆ మునిపత్ని "ఇది యేమి?" అని వారల ప్రశ్నించెను.

పులోము డుత్తరముగా ఫక్కుమని బిగ్గరగా నవ్వెను. ఆ నవ్వులో నాతని ముప్పదిపండ్లును బయటపడెను. ఆ కఠోరశబ్దమున కా మునిపత్ని ఉలిక్కిపడెను.

"అమ్మా, నేను ఒంటరిపాటున కూర్చుండి ఉండగా వీడు ఇట్లే భయంకర శబ్దము చేసెను. నీ వలెనే నేను కోసిన పూల బుట్టయు, దాని వెంట నేనును త్రుళ్లిపడి ప్రక్కనున్న మందాకినీ ప్రవాహములో పడిపోతిమి. అందులో ఒక ఆవర్తములో పడి గిరగిర తిరుగుడు పడు చున్న నన్నుమాత్రము వీడు తన ముట్టెతో నెట్టి ఒడ్డు పట్టించినాడు."

ఇట్లు పులోమ చెప్పగా విని మునిపత్ని "తల్లీ, ఎంత గండము తప్పినదే!" అనుచు దగ్గరకు తీసి కట్టిన తడివల్కలములు మార్పించి ఉపచరించెను.

ఈ కథ యాశ్రమమంతట వెంటనే ప్రాకిపోయెను. మునులు, మునిపత్నులు, మునిబాలురు, మునిబాలికలు, బ్రహ్మచారులు—అంద రును వచ్చి పులోమను పలుకరించి యామెకు సాహసముతో ప్రాణ దాన మొనర్చిన యా పులోమదానవుని బరిపరివిధముల శ్లాఘించిరి. ఆ యుదయవేళ నాతని యపశబ్దోచ్చారణకు పదరి పరిహసించిన బ్రహ్మచారులుగూడ నిప్పు డాతని నాదరదృష్టుల ముంచివేసిరి.

౫

**ఆ పిమ్మట** పులోమకు పులోముడు సంతతసహచారి యయ్యెను. ఆమెకు సోదరుని యెడబాటుచే గలిగిన చింతయు గొంత దూర మయ్యెను.

ఆమె కేమి పని యున్నది? తండ్రియగ్నిహోత్రములకు కావలసిన సమిధలు, కుశలు బ్రహ్మచారులే ప్రాంతాటవినుండి తీసి కొని వత్తురు. ఆమెతల్లి యగ్నిహోత్రశాలయందు అగ్నులు విహరించి దానితో మహానసమున హవిరర్థముగా పాకము చేయును. ఆశ్రమ గోవుల నన్నిటిని గోపాలురే చూచుచుందురు. అంగిరర్షి హోమ ధేనువు నొకదానినిమాత్రము ఆ మునిదంపతు లిద్దరే ఉపచరింతురు. ఆ గోమాత యా యాశ్రమమున కంతటికిని తల్లియే! దాని పూజకు మాత్రమే పులోమనుగూడ అప్పుడప్పుడు నియోగించుచుందురు. మరి యిక అంగిరర్షి త్రికాలములయందును బ్రహ్మవిష్ణుశివాత్మకు డగు పర మేశ్వరు నారాధించును. ఆ దేవతార్చనకు పూలుకోయు టొక్కటే పులోమకు నియతమైన పని. ఆ పూలుకోయు పని యామె కొక

యాట. అందుకై ఆమె యాశ్రమతరువులకడ నేకాక ఉపాంతారణ్య భూములగూడ సంచరించును.

ఇప్పుడు పులోమ వీపనిపై బోయినను చెలికాడగు పులోము డామె ననుసరించును. అతనికి మునిబాలురతో సాహచర్యము కష్టతర మయ్యెను. వారి కాతనియందు మిక్కిలి యాదర ముదయించినది. అతనిని చూడగానే వారు వరాహఘుర్ఘురము ననుకరింపు మని సూచించుచు అట్టి ధ్వని చేయుదురు. పులోము డొకసారి ఆనందము తోడను, మరియొకసారి కోపముతోడను భయంకరధ్వని చేయును. అది విని బ్రహ్మచారులు అందరు సంతోషముతో నవ్వుదురు. అంతేకాని వా రెక్కువగా నితనితో నేమియు సంభాషింపరు. అధరమిశ్రమైన పరిహాసమే వారు చేయునది. వేదాభ్యాసజడు డగు పులోమునితో నా బ్రహ్మచారులకు దీర్ఘ సంభాషణ మెట్లు పొసగును?

కాని యాతనివెంట పులోమ యున్న వేళల వా రట్లు వాని బరియాచకమాడరు. కులపతికుమార్తె ఎంత చిన్న పిల్లయైనను బ్రహ్మచారు లందరకు మాననీయ. ఆమె వచ్చుచున్న వారందరు ప్రక్కకొదుగుదురు. ఆమెవెంట నున్న పులోమునిగూడ వా రట్టియెడ పలుకరింప స్వతంత్రింపరు. పులోమయందలి గౌరవభావ మాతని యందును సాహచర్యముచే సంక్రమించును.

అది పుష్యమాసము! దూరమున తెలగా కన్పించు హిమాలయ శిఖరముల శీతలదృష్టిపాతము హరిద్వారక్షేత్రమునగూడ తీవ్రముగా ప్రసరించు చుండు నది. వివిధ ద్రుమగుల్మము లప్పుడే ఆకులు రాల్ప నారంభించును. పుష్పములు అరుదుగా లభ్యమగును. వానికై పులోమ వనభూముల దూరసంచారము లొనర్చును. తామరాకులతో కుట్టిన దొన్నెలలో వా రిద్దరు పుష్పములు సేకరింతురు.

పులోమ లేడివలె పరుగెత్తి వానికి కనబడకుండ దాగు కొనును. పులోముడు ముకుపుటములు పైకెగురవేయుచు పులోమ దేహమునుండియు, ఆమెచేతి నున్న సంపుటమునుండియు వీతెంచు పద్మాదిపుష్పసౌరభమునకై వెదకుచు కొంతవడికి నిర్ధారించి యామె దిక్కునకు అతివిపంచికవలె నిర్వక్రమైన పరుగున పరువెత్తును. ఇతర వేళల పులోమ దూరముతొలగి గాలివాలునకు పోయి చెట్టుకొమ్మల దాగి కోయిలవలె కూతవేయును. పులోము డది విని చెవులు రిక్కించి శబ్దము వచ్చుచున్న మార్గ మువలక్షించి డేగవలె నటు వంకకు పరుగెత్తుకొనిపోయి యామెను కలసికొనును. మరియొకప్పు డామె యాతని కట్లో తప్పించుకొని రాళ్లగుట్టల నడుమ దాగి యేదియో ఏకాంతమున ధ్యానించుచుండును. పులోము డామె కన బడకున్నచో ఎదురైన శిలశిల్ల దొర్లించుచు పెద్దవానిపైనుండి లంఘించుచు అలసట లేక పరిభ్రమించి తుద కామెసమీపము నేటయిన జేరుకొనును. ఆమె తన్నప్పుడు పలుకరింపనిచో నిశ్శబ్దముగా నామె మాటాడువరకు నామెవైపు చూచుచు ప్రక్కనున్న గడ్డిపరకలలో నొకడై నిలిచిపోవును.

వారు తరచుగా జలక్రీడ లాడుదురు. పులోమ చేపవలె నీటిలో దూటిపోవును. పులోము డామెను మహిషమువలె నీళ్ళు చిమ్ముచు వెంబడించును. వా డెంత మోటువాడైనను పులోమ కట్టి బాధయు రానీయకుండ వర్తించును.

ఈ విధముగా నా చలికాలమంతయు గడచిపోయినది. పులోముని తలిదండ్రులు దానవరాజ్యమున శీతబాధ దుర్భరమైన సంవత్సరములలో హేమంతకాలముల నిట్లే హరిద్వారము వచ్చి బంధు దర్శనము చేసి మరల వసంతారంభమునకు ముందుగా స్వరాజ్యమున కట్టహాసముతో చేరుకొందురు.

దనువును, దనుపత్నియు ఆ ట్లా సంవత్సరము మరల స్వరాజ్యమునకు వెళ్ళబోవుముందు అంగిరోధర్మపత్నితో తమ కుమారుని వివాహవిషయము ప్రస్తావించి పులోమునికి వారి కుమార్తె పులోమ నిమ్మని యర్థించిరి. ఆ సాధ్వి యెంతయు సంతోషించి యీ శుభాకాంక్ష కులపతులకు నివేదింప నాదేశించెను.

ఆ దంపతు లంతట కులపతి యంగిరస్సులను సందర్శించి పులోముని కొరకు వారి కూతు పులోమను వరించిరి. ఆ మాటలు వినిన యీ యంగిరస్సు అంతరంగమున గలిగిన చిరునవ్వు అంతరంగకుహరముననే అణచుకొనెను.

"వీరు వేదమర్యాదలే యెరుగని ద్విజబంధువులు. మంత్రోక్తమైన కన్యావరణపవిత్రవిధానమే వీరు విస్మరించిరి. వేదాభ్యాసజడు డగుటే కాక దేవవాక్కు స్పష్టముగా నుచ్చరించుటకూడ మరచిన యీ పులోమదానవునికి హవిస్సువలె పవిత్రయగు పులోమను కన్యాదానము చేయ నే నిచ్చగింతునా? వీరి పర్వతాటవికరాజ్యసంపత్తి మాకు ప్రలోభము కలిగించు నని తలంచియుందురు. పాపము, వీరికి దూరాలోచనయే యుండదు. కేవల స్త్రీబుద్ధికంటె వీరి యూహలు దూర మధిగమింపలేవు."

ఇట్టి భావము లెన్నియో ఒక్కక్షణములో అంగిరస్సు చిత్తరంగమున మెరసియుండును. అయినను అనవసరముగా ఇతరుల మనస్సు నొప్పించుట యార్యధర్మము కాదు. అందుచే క్లుప్తముగా, "ఆలోచింతము. తొందర యేమి?" అని మాత్రము కులపతి ప్రత్యుత్తర మిచ్చెను.

వారు సంతోషముతో తిరిగివచ్చి యీ విషయము నంగిరోధర్మపత్ని కెరిగించిరి. వారు ముగ్గురు పులోమాపులోముల వివాహమునకు కులపతు లంగీకరించినట్లే భావించిరి. పులోము డది విని పొంగిపోయెను.

పులోమమాత్రము తల్లిమాటలు విని యాశ్చర్యపడెను. పులోముడు ఆటలాడుటకు సహచరుడుగా ఎంతయైన నుపయోగించును. కాని తా నాతని నాథునిగా భావించి యర్చింప యోగ్యుడా? అంగిరసులే ఇందు కంగీకరించియుందురా? అయినను మాతృవాక్యములే అనృతము లెట్లగును? నిరంతరముగా వైశ్వానరపూజ చేయ

నన్ను అనర్హురాలని పులోమునితో నేనాడిన యాటలచే నిశ్చయించి యట్లు కపటకులు చేసిరేమో!

ఈ విచారభారముతోడనే యామె యాసాయంకాలమున పరమేశ్వరార్చనసమయములో అంగిరర్షుల సన్నిధి నుపవిష్టయై యుండెను. అంగిరర్షులును పులోమముఖభంగిని సూక్ష్మముగా నుపలక్షించిరి. ఆమెముఖమున సంతోషచిహ్నములకు మారు తీవ్రచింతామేఘములు స్పష్టముగా వారికి గోచరించెను. అదిచూచి వారి కానందమయ్యెను. వారంతట పులోమను కటాక్షవృష్టులతో కరుణించిరి.

“పులోమా! నిన్ను ఆ పులోమరాక్షసున కీయ నియ్యకొందునా?”

ఇట్లు నోటితో చెప్పకయే వారు చెప్పినట్లు పులోమకు ద్యోతమై, యామెకు మనశ్శాంతి కలిగెను.

౬

**ఆ మరునాటినుండియు** పులోమలో నొక మార్పు సుస్పష్టముగా గోచరించెను. ఆమె కెక్కువ మాట్లాడు స్వభావ మెన్నడును లేదు. ఇప్పు డసలే మాట్లాడదు. అటులు మరిగి పూర్వము దూరము పరిభ్రమించును. ఇప్పు డాశ్రమవాటిక విడిచి యావల పోదు.

సమీపించుచున్న వసంతాగమమునకు ఎదురుచూచుచు ప్రకృతికాంత ఋతురాజాహ్వాన సన్నాహములో నున్నది. ఆశ్రమవనమంతయు పూవులతో, చిగుళ్లతో నిండి రంగారుచుండెను. నల్లని తొడిమలు ఎరుపు తెలుపు కలిసిన వర్ణము కల పాటలీపుష్పముల మధువుకు తుమ్మెదలు మూగుచు ఝుంకారములు ప్రారంభించెను. కర్ణికారపుష్పములు వర్ణప్రకర్షచే నిర్గంధములైనను జనుల దృష్టుల నాకర్షింపసాగెను. అశోకతరువులు పుష్పపల్లవితములై యానందము కలిగింప నారంభించెను. ఇంచుకంత చిలుకపచ్చరంగు కలసిన మోదుగులు పుష్పించి ఎఱ్ఱనికాంతు లెల్లెడ వెదజల్లుచుండెను. నవ్వుపువ్వుల శ్రీ గల పుష్పములు తిలకములకు పూచెను. అరటిని కొంచెము పోలియుండు నల్లని ప్రేంఖణలతలనుండి కుసుమవాసనలు దిక్కుల వాసింపసాగెను. ప్రియాళుద్రుమమంజరు లెంతయేని హృదయప్రీతి కలిగించుచుండెను. వాసంతవృక్షరాజములగు మామిడిచెట్లు ఎఱ్ఱని చిగురుటాకులమధ్య గుత్తులుగుత్తులుగా తెల్లగా పూసిన పూలతో దూరదేశములనుండి పుంస్కోకిలముల నాహ్వానించుచుండెను.

ఆనందతన్మయత కలిగించు నా వసంతాగమసమయమున చిత్రముగా పులోమ కుత్సాహ మేమాత్రము వ్యక్తము కాలేదు. శీతకాలమున నీరు తగ్గి తీవ్రవేగముతో ప్రవహించు మందాకినీనది యిప్పుడు ఒడ్డొరసికొని ప్రవహింప నారంభించెను. సూర్యరశ్మి ప్రభావముచే హిమాచలశిఖరములం దుండి సెలయేళ్ళు రొదలు చేయుచు పరుగువారి మందాకినీనదిలో కలిసిపోవుచున్నందున నా ప్రవాహము పూర్ణమై గంభీరమంథర మగుచుండెను. పవిత్రమగు నా మందాకిని ననుకరించుచు పులోమ హృదయాంతరముకూడ గంభీరమంథర మగుచుండెను. పూజాపుష్పములు ఆశ్రమతరులతలనుండియే యామెకు పుష్కలముగా లభించుచుండెను.

చైత్ర శుద్ధ పంచమి వచ్చినది. ఆనాటి మధ్యాహ్నమున అంగిరర్షి వైశ్వదేవము నిర్వర్తించి అతిథ్యభ్యాగతుల యాగమనమునకై నిరీక్షించుచుండెను. ఆ సమయమున వేదవిదులగు బ్రాహ్మణోత్తములు నలుగురు కుశపాణులై వచ్చి యంగిరర్షిని సమీపించిరి. వారిని అంగిరర్షి అర్ఘ్యపాద్యాదుల నర్చించెను. అంతట వారు నూతనముగా సమావర్తనము చేసికొన్న భృగువరునకు ధర్మప్రజాసంపత్తి కొరకు అంగిరర్షిని వారి కన్య పులోమను వధువుగా నిమ్మని వరించుచున్నామని యథాశాస్త్రముగా నర్థించిరి. వారు వర్ణించిన బ్రహ్మవరుని కులగోత్రములు ఒక్క క్షణము విచారించి అంగిరర్షి సంతుష్టుడై “వృణీష్వం, దాస్యామి” అనుచు సమ్మతి తెలిపెను. అట్లు ముమ్మారు కన్యావరణమును, అంగీకారప్రతివచనములును జరిగినంతట నా బ్రాహ్మణులు సమీపారణ్యభూమిని కూర్చున్న భృగువు నొద్దకు పోయి కృతార్థుల మైతి మని నివేదించిరి.

ఇంతలో అంగిరర్షి ధర్మపత్నీసమేతుడై వెంట నాశ్రమర్షులు స్వస్తివాచనము పలుకుచు రా బయలువెడలి భృగువును సమీపించి వరపూజ చేసి యాశ్రమములోనికి తీసికొనిపోయి నారాయణస్వరూపుడగు నా యతిథికి పులోమను ధర్మప్రజాసంపత్త్యర్థము కన్యాదాన మొనర్చెను.

భృగువు మహాతేజస్వి! అంగిరర్షి యెదుట నున్న భృగువును చూచిన భాగ్యశాలురకు మధ్యాహ్నమార్తాండుని యెదుట నిలిచి యున్న బాలభానునివలె భాసించెను. భృగువు తాను దాచబెట్టిన తనద్రవ్యము మరల గ్రహించినట్లే పులోమకరను గ్రహించి ప్రధానహోమము చేసికొని అగ్నితోకూడ నామెను వెంటబెట్టుకొని తోడు వచ్చిన బ్రాహ్మణులతో కలసి తన యాశ్రమమునకు తీసికొనిపోయెను.

అక్కడ భృగువు శాంతముగా నొక్క సంవత్సరకాలము వివాహదీక్ష నిర్వర్తించి యగ్నిసాక్షికముగా పులోమను వివాహము చేసికొనెను.

౭

అంగిరర్షి పులోమను కన్యాదానము చేసి ఎన్నో నెలలైనది. ప్రాణసమానముగా నంతకాలము పెంచిన యాపిల్లవత డెన్ని నెలలును మనస్సులో దలచినట్లయిన లేదు. భృగువునకు దాని నిచ్చి నంతటనే యది భార్గవద్రవ్య మైనదని పులోమపై నాతనికి మమకారము వదలిపోయినది.

ఒక్కనా డొక్కనాడు దానవరాజ్యమునుండి ఇంద్రియమజ్ఞ వంది పులోముడు పులోమను చూడదలచి అంగిరస్సునాశ్రమమునకు వచ్చెను. వచ్చిచూడగా పులోమ యందు లేదు. అంగిరోపత్ని

నడుగగా పులోమను కులపతులొక బ్రాహ్మణునకు దానము చేసి రని యామె చెప్పెను.

ఆ మాటలు విని పులోముడు ప్రళయరుద్రునివలె మండి పడెను.

"నాకై దనుదంపతులు వరించిన పులోమను కులపతులు ఇత రుని కెట్లిచ్చిరి? కులపతులను అనృతమాడింపజేసిన యా బ్రాహ్మ ణాధము డెవరు?"

ఆ దానవు వాక్యము లాలకించి యా మునికాంత కోప గించియు స్త్రీసహజమగు మృదువాక్యములతో ఇట్లనెను:

"ఓరీ, నీ క్షేమమును పోయే కాలము వచ్చినదా, నాయనా? కులపతులు అనృతమాడి రంటివి, భృగువును బ్రాహ్మణాధము డను చుంటివి!"

"అవును! కులపతు లనృతమే యాడిరి. నాకై వరింపబడిన పులోమను మరియొకని కిచ్చిరి. దీని కుధయులకును శిక్ష చేసెదను!"

ఆ సాధ్వి పలుకుచున్న యుపశమనవాక్యము లాలింపక క్రోధతామ్రాక్షుడై పులోముడు కేకలు వేయుచు అంగిరర్షి తపస్సు చేయు నగ్న్యగారముపై బడ పరువెత్తెను. ఆశ్రమస్థు లందరు నా పశుసమానుని జూచి కేకలు వేసిరి. ఋషిపత్నులు హాహాకారము లొనర్చిరి. బాలురు, బాలికలు భయకంపితులై తల్లుల కొంగులలోనికి బోయి దాగుకొనిరి. వేదపాఠములు వల్లనవేయు బ్రహ్మచారులు నంత యాపి పులోముని కడ్డుపోయిరి. వాడు నిర్లక్ష్యముగా వారల నందర నెట్టుకొనుచు ముందుకు పోవుచుండెను.

పులోముడు అగ్నిశాల ప్రవేశింపబోవుచుండెను. సరిగా నప్పుడు కింకరు డొక డడ్డు నిలిచి యాతని రొమ్మున గ్రుద్ది వెనుకకు పడద్రోసివైచెను. మరియిద్దరు కింకరులు బలవంతముగా పులోముని రెండురెక్కలు పట్టుకొని, యాశ్రమమునుండి బయటికి లాగివేసి, "జీవితముపై నాశ యున్నచో నాశ్రమము పరిహద్దుల కికముందెన్నడు రావద్ద"ని కఠినముగా ఆనచేసిరి.

పులోముడు ఆ కింకరుల శక్తిముందు తాళజాలడయ్యెను. దెబ్బలు తిని తోక ముడిచిన కుక్కవలెనే అతడు ముఖము ముడుచు కొని యటనుండి వెడలిపోయెను.

అప్పు డాతని కొక యూహ తోచెను:

"మోసగింపబడిన యీ అంగిరస్సుపై నా కెందు కీకోపము? దీని కంతటికి కారకు డా భృగువు! నా పులోమను హరించినది వాడు! కనుక వానిని శిక్షించి నా పులోమను నేను తెచ్చుకొందునుగాక!"

కాని యీ భృగు వెవరు? అతి డెక్కడ నుండును! ఇది చెప్పువా రెవరు? అంగిరస్సుని యాశ్రమమున కేగి తెలిసికొను నవ కాశ మిక లేదే!

౮

పులోముని దృఢసంకల్ప మాతని శాంతచిత్తుని గావించెను. అతడింతట వినీతవేషుడై యా చుట్టుప్రక్కల నున్న మునిపల్లె లన్నియు పులోమకై వెదకెను. మునిపత్నుల చేతిచలువచే ఏ యాశ్రమమున కేగినను అతనికి ఆతిథ్యమునకు కొదువలేదు. ప్రతిదినమును దానికై కష్టింపకయే మృష్టాన్న మాతనికి వేళకు లభించుచున్నది.

ఆ మునిపల్లెల చుట్టును గల యరణ్యములలో నివసించుచు శరీరకష్టము చేయుట కిష్టములేక మునిపల్లెలకు ముష్టికై వచ్చుచు అవ కాశము చిక్కినప్పుడెల్ల అందరి ధనధాన్యములు దోచుకొనిపోవు దస్యుజనము లుండెడి. పలువు రట్టివారితో క్రమక్రమముగా పులోము నకు పరిచయ మయ్యెను. వాడును మధ్య మధ్య వారితో నివసించును. మధ్యమధ్య మునిపల్లెల చుట్టును కొరాడుచు పులోమకై వెదకులాడు చుండును. అతని భుజబలమునకు తోడైన బుద్ధిబలముచేతను, సాహస కార్యములవలనను అచిరకాలములో నాత డా దస్యుజనమునకు నాయకు డయ్యెను.

పదిరేండ్లపాటు వా డట్లు పులోమను వెదకుచు పరిభ్రమించెను. హరిద్వారమునుండి దక్షిణాభిముఖుడై యత డట్లు వెదకికొనుచు పోయిపోయి శతాధికయోజనములు గడచి పెద్ద మరుభూమి చేరు కొనెను. దాని నతిక్రమించి తుద కాతడు సముద్రతీరమున కేగెను.

సముద్రతీరమునగూడ కొన్ని యాశ్రమములు కలవు. అక్క డనే భృగ్వాశ్రమ మున్నది. తిరిగి తిరిగి యా పులోముడు ఒకనాడు భృగువునాశ్రమమునే ప్రవేశించెను.

౯

భృగు వా యాశ్రమము నిర్మించుకొని యెక్కువకాలము కాలేదు. వివాహమునకు ముందుగనే ఆ ప్రదేశము నిర్ధారణచేసికొని భృగువు పులోమను, అగ్నిహోత్రమును వెంట నిడుకొని యక్కడ నిర్మించిన కుటీరములో నూతనగృహప్రవేశము చేసి యగ్నిప్రతి ష్ఠాపన మొనర్చి వివాహదీక్ష నిర్వర్తించెను. అంతట నల్పకాలమునకే అతి డగ్న్యశ్త్రాన మొనర్చి సోమయాగము చేసి యంతట క్రమముగా క్రతువులు నిర్వర్తింపసాగెను. అత డట్లు చేయుచున్న క్రతువులకు కావలసిన ఋత్విక్కుల నివాసములకును, సంభారములకును మాత్రమే కుటీరములు పెరిగినవిగాని ఆశ్రమ మింకను విస్తరింపలేదు.

కొంతకాలమునకు భృగుమహర్షికి సూర్యునివలె నుగ్రతేజస్వి యగు పుత్రు నుత్పాదింపవలె నను నిచ్ఛ జనించెను. తన కోరిక కను గుణమైన సంస్కారములతో నాతడు పులోమయందు గర్భాధాన మొనర్చి నియతకాలమున పుంసవనవిధి నిర్వర్తించి సీమంతోన్నయ నము లొనర్చెను. పులోమకు నవమాసములు నిండెను. మరి మూడు మాసములకు సూర్యసమునగు కుమారు డుదయింపగల డని భృగువు నిరీ క్షించుచుండెను.

అట్టికాలమున పులోమదానవుడు పులోమాసాధ్విని వెదకుచు భృగుమహర్షి యాశ్రమమునకు వెళ్లెను. వాడు వచ్చు వేళకు భృగుమహర్షి స్నానార్థము ఆశ్రమసమీపమునందలి సానదియొద్ద కేగెను. భర్త తిరిగివచ్చునప్పటికి అగ్నులు విహరించియుంచు నుద్దేశముతో పులోమ యగ్నిహోత్రశాలలో నుండెను. ఆశ్రమమున కతిథి వచ్చినా డని విని యామె బయటికి వచ్చి యెదుట నున్న పులోమదానవుని జూచి యాదరముతో నర్ఘ్యపాద్యాదు లొసగి యర్చించెను.

పూర్ణగర్భిణి యగు పులోమాదేవిని జూచి పులోముడు గుర్తింపలేదు. అతనికి తనతో నాడుకొన్న పదేండ్ల కన్యకరూపమే స్మృతిలో నున్నదికాని, యిట్టి సర్వాంగసంపూర్ణమై అనింద్యమనోహరమైన సాధ్వీమూర్తి చిత్రితమై లేదు. కాని ఆమెను దర్శించినంతనే పులోముని దేహమున నాకస్మికముగా విద్యుత్పాతమువలె కామము ప్రవేశించెను. తరువును దగ్ధముచేయుటకు తరుకోటరములో ప్రవేశించు నగ్నికణమువలెనే అది యతని హృదయము నావేశించెను. రొమ్ములో నాతనికి చేయిపెట్టి కలచిన ట్లయ్యెను. రక్తనాళములం దల్లెడ ననేక కాలసర్పములు ప్రాకుచున్నట్లు తోచెను.

"ఇది భృగువునాశ్రమమై యుండునా ? ఇది నాకై వరింపబడిన పులోమయై యుండునా ?"

పులోమాదేవి యాతని కన్నెత్తియైన చూడలేదు. అతిథికి చూపవలసిన మర్యాదమాత్రము నిర్వర్తించినది. బాల్యస్నేహితుడైన పులోముడితడని యామెయు పోల్చుకొనలేదు. అతిథిసత్కారము లొనర్చి యామె తిరిగి యగ్నిహోత్రశాల ప్రవేశించి తొందరతొందరగా అగ్నులను గార్హపత్యాహవనీయదక్షిణాగ్నికుండములలో విహరించుచుండెను.

పులోముడు తన సంశయము తీర్చుకొనదలచి యామెను తేరి చూచుచు నామెవెంటనే అగ్నిశాల సమీపించెను. చూచినకొలదిని వానికి కామ మెక్కువయ్యెను; ఈమె పులోమయే యను సందియము దృఢము కాజొచ్చెను.

ఆ అగ్నిశాలలో భృగు వుపాసించు నా యగ్నిహోత్రుడు మూడు శిరస్సులతో, ఏడు జిహ్వలతో ప్రజ్వలించుచు ప్రసన్నవదనుడై మూర్తిదాల్చి ప్రత్యక్షమయ్యెను. తన హృదయదాహము చేయుచున్న వైశ్వానరుడు ప్రేరేపగా పులోముడు భృగు వుపాసించు నా పావకునికి ప్రణమిల్లి యిట్లనెను :

"ఓ పావకుడా, నీవు సమస్తదేవతలకు ముఖమవుగదా ? ఈ వరారోహ ఎవ్వరి భార్యయో చెప్పుము ! ఋతమునకు బద్ధుడవై ప్రత్యుత్తర మిమ్ము. నాచే నిది ముందు వరింపబడినది. పిమ్మట తండ్రి అనృతకారియగు భృగువు కీమె నిచ్చినాడు. ఆ బాధ యీ పదేండ్లనుండి శల్యమువలె నా హృదయమును వేధించుచున్నది. భృగువు పొందిన నా పూర్వవృతభార్య యిదియే యైనచో దీని నీ యాశ్రమమునుండి యెత్తుకొనిపోయెదను. కాబట్టి సత్యమే చెప్పు పావకా !"

పావకుడు ప్రత్యుత్తర మీయలేదు. పులోమ యామాటలచే నావచ్చినది పులోము డని యెరిగి యాశ్చర్యపడె. యాతని వైఖరికి కొంచెము భయ మావేశించి మౌనము వహించి తన పని తాను చూచుకొనుచుండెను.

పులోముని సంశయము మరింత యెక్కువయ్యెను. అంతట నాతడు పావకుని పరిపరివిధముల ప్రశ్నించెను.

"ఓ అగ్నీ, నీవు నిత్యము సర్వభూతములకు అంతర్యామివై చరించుచుందువే ! పుణ్యపాపముల కన్నిటికి సాక్షివై యుందువు కవీశ్వరుడవే నీవు ! సత్యము పల్కుము. ఇది అనృతకారియైన భృగువుచే పూర్వాపహృతయగు నాభార్య యైనచో ఆమాట నీవు చెప్పవలసినది. నీ వామాట చెప్పినచో నీయెదుటనే యీమె నెత్తుకొనిపోయెదను. ఓ జాతవేదా, నేను చెప్పుమని యడుగుచున్నాను. నీకు తెలిసిన నిజము చెప్పకతీరదుసుమా !"

అగ్నిసాన్నిధ్యమున నాపులోముని మాటలు విని పులోమ యించుకంత సంచలించెను. కాని తన బాల్యమిత్రుడు సత్యమెరిగినచో దుర్మార్గము తలపెట్టడను నాశతో ధైర్యము పూనెను.

ధర్మబంధము తమ ప్రత్యర్థులకు తగిలించుటకేగాని రాక్షసులకు కాదనియు, వారు తమ వృత్తిలోమాత్రము విశృంఖలు లనియు పాప మామె కేమి తెలియును !

సర్వజ్ఞుడగు పావకుడుమాత్రము దుఃఖించెను. అతని మూడు శిరస్సులను చింతాధూమము లావరించెను. ఒకవంక ననృతభయము ! మరియొకవంక ఈ రాక్షసుడు దుర్మార్గము చేసినచో తన్నుపాసించు భృగువు కేమి కోపము వచ్చునో యను భయము ! అయినను సర్వాంతర్యామి యగు నా యగ్ని సత్యధర్మబద్ధుడై శాంతవచనము లిట్లు పలికెను :

"ఓయి దానవుడా, ఇది నీవు మున్ను వరించిన పులోమయే. కాని నీవు దీనిని మంత్రపూర్వకముగా గాని, విధిపూర్వకముగాగాని వరించలేదోయి ! ఈమెతండ్రి వరలోభముచేనైన నీ కిత్తు నని వాగ్దత్తము చేయలేదోయి ! ఆ పిమ్మట దీనిని భృగువు వేదవిధిపూర్వకమైన కర్మయుక్తముగా వరించి తండ్రివల్ల పుచ్చుకొని నేను సాక్షిగా భార్యగా వివాహమాడినాడు. నే ననృతమాడను. ఇది భృగుధర్మపత్ని !"

౧౦

అగ్నిహోత్రు డా మాటలు పల్కినంతనే పులోమదానవునికి ఆవేశము పూనిన ట్లయ్యెను.

"నీ వడిగినావే కాని దీనిని తండ్రి నీ కీయలేదు. నీ వడిగిన విధానమే సక్రమమైనది కాదురా ! క్రమమార్గమున భృగువు దీని

తండ్రివద్దనే యౌవనమ్ము పొంది అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యరా వానికిది! నీ కెట్టి సంబంధమును లేదు. నీ విత్తుకొని పోవుట యధర్మమురా!"

ఈ యథార్థములు పలికిన యా ధర్మదేవతావాక్యములు విచారణ పులోముని తల కెక్కలేదు!

"ఇది నేను మున్ను వరించిన పులోమ! ధర్మదేవత యగు నగ్నిదే ఇది యొప్పెను. నా భార్యను భృగువు హరించినాడు! దీని నిప్పు డెత్తుకొని పోవలసినదే!"

ఇట్లా దానవుడు తన కామమున కనుకూలించునంతవరకే అగ్నిహోత్రుని వాక్యములు ప్రమాణములుగా గ్రహించెను. మిగిలిన మాటలతో వానికి నిమిత్తమేమి? "నాకోరిక కనుకూలించునంతవరకే ధర్మదేవత వాకు ప్రమాణము! తక్కినది వినిపించుకొనను!"

ఈ విధమగు మానసికప్రవృత్తి కలది దానవబుద్ధి! అందుచే పులోముని సుఖము విసర్జమయ్యెను. చిన్నప్పుడు హరిద్వారమున మందాకినీజలావర్తములలో పులోమాకన్య తిరుగుడుపడుచుండగా తా నామె నుద్ధరించిన వలాహకాకారమే ఇప్పు డాతని నావేశించెను.

పులోము డగ్నిహోత్రగృహములోనికి దూసుకొనిపోయి తన శిరస్సుతో పులోమాదేవి దేహమును క్రుమ్మి నెత్తిన వేసికొని అడవి పందివలె ఆ యాశ్రమమధ్యమునుండి పరుగువారెను. భృగువునాజ్ఞ కింకరు లడ్డుకొచ్చు నవకాశమునకూడ లేకపోయెను. అంతయు మెరపు మెరసిన ట్లొక్క త్రుటిలో జరిగిపోయెను. అరణ్యములలో నాతడు ప్రవేశింపగనే పులోముని దస్యుసేవకు లాతని గలసి పరివేష్టించిరి.

పులోమాదేవి దిగ్భ్రాంతి నొందెను. ఆమెకు ప్రథమములో కలిగిన యాశ్చర్య మెంకింత విరిసి కలయజూచునప్పటికే యాశ్రమము దాటిపోయి యరణ్యమున దస్యుగణముల మధ్యముందుండెను. ఆ దస్యులుగూడ క్రొత్తవారు కారు! వారిలో పలువు రామె యొద్దకు అన్నార్తులై యెన్నియోమారులు వచ్చి యాశ్రమమున మృష్టాన్నము కుడిచినవారే! కొందరందులో తలలు వంచుకొనిరి. కొందరు పెడముఖములు పెట్టుకొనిరి. కాని పెక్కురామెను జయోన్మాదముతో పరిహసించుచు పెద్దపెట్టున నవ్వసాగిరి.

అది చూచి పులోమకు సహజమగు ధైర్య మొక్కసారిగా సడలిపోయెను. ఆర్తకంఠముతో నామె బిగ్గరగా భృగువును కేక వేసెను. దూరమునుండి అరణ్యప్రతిధ్వనియే కాని భార్గవకంఠము వినిపించలేదు. మరల నామె యట్లే కేక వేసి భార్గవప్రత్యుత్తరమునకై చెవు లొగ్గి వినెను. మరల నరణ్యప్రతిధ్వనియే కాని భృగుకంఠము బదులు పలుకలేదు. మీదుమిక్కిలి దస్యుల పరిహాసశబ్దము లెక్కువ కాసాగెను. ముందు తలలు వాల్చినవారును, పెడమొగములు పెట్టిన వారునుగూడ ధైర్యము తెచ్చుకొని యా పరిహాసకులలో గలయుచుండిరి.

ఆమె మరల మూడవమా రట్లే కేక వేసి యాలించెను. మరల నంతకంటె నెక్కువ ప్రయోజనము లేకపోయెను.

పులోమాదేవి యంతట నా పులోమునికి ధర్మ ముపదేశించి యాతనిని తన్ను వదలుమని ప్రతిమాలుకొనెను. వాడు ధూమావృతముఖుడై యా మాటలు పెడచెవిబెట్టెను.

"నీవు చెడిపోదువు! కాల మాసన్నమైనది. నీ మృత్యువును నీవు వరించుచున్నావు!"

పులోమ ఇట్లు బెదరింపగా నదియు వాడు పెడచెవిబెట్టెను.

అంతట మరల నామె యాతని ప్రతిమాలి యాతని పూర్వపు మంచితనమంతయు స్మృతికి తెచ్చెను. వా డదియు వినిపించుకొనలేదు. మరల నామె యాతని నెన్నియో విధముల బెదరించి చూచెను. ప్రతిమాలెను. అన్ని ప్రయత్నములును వ్యర్థమయ్యెను.

అంతట పులోమ యుచ్చైస్స్వరముతో కేకలు వేయనారంభించెను. అది ఒకటే దీర్ఘ ప్రతిధ్వని! ఒక కేకయైన వెంటనే గుక్క త్రిప్పుకొనుటే వ్యవధానముగా మరల కేక వేయసాగెను. ఆ కేకలు అరణ్యభూమియంతయు నిండి దిగంతములకు బారుచున్నట్లు విన్నవారికి తోచెను. ఆ కేకలు వేయుచుండగా నామెకన్నులవెంట నీరు ఏకధారగా ప్రవహింపసాగెను.

కొంతసే పట్లామె కేకలు వేయగా ఆమెదీనాకారమును జూచి, యామె వేయుచున్న కేకలు విని పులోమరాక్షసునకు గూడ నొక యపూర్వమగు భయ ముదయించెను. వెంటనే దృఢకాయులగు పలువురు దస్యుల నామెదేహమును మోయ నియమించి తా నామె శిరోభాగము వహించుచు నుత్తరాభిముఖుడై పరుగెత్తిపోసాగెను. మిగిలిన దస్యులు స్త్రీపురుషులు వారి ననుగమింపసాగిరి.

ఇట్లు మూడురాత్రులు, మూడుపగళ్లు విధివిరామము లేకుండ భయవిహ్వలచిత్తులై వారు శీఘ్రయానమున బోయి తుదకు నాలవనాటి వేకువవేళకు ఒకానొక పర్వతపంక్తిమధ్యమున గల మహారణ్యమున నున్న సరోవర మొకటి దరిసిరి. అచ్చట పులోమను ప్రథమపర్యాయము దింపి పులోముడును, దస్యులును విశ్రమింపసాగిరి.

ఆ మూడు పగళ్లును, ఆ మూడురాత్రులును విరామము లేకుండ పులోమాదేవి యాక్రోశించుచు ఏకధారగా కన్నీరు కార్చుచునే యుండెను. ఆమెదేహమున నంతకంతకు బలము క్షీణించిన కొలది యామెకంఠస్వరమును క్షీణింపజొచ్చెను. తుద కామెకు బడలికచే మూర్ఛ వచ్చుచున్నట్లయ్యెను.

అట్టి సమయమున నామెకు ప్రసవవేదన మాకస్మికముగా నారంభించెను!

దస్యుకాంతలవలన పులోముఁడది యెఱిఁగి ఉప్పొంగి పోయెను.

"ఈ మెగర్భములోని శిశువు పుట్టినంతనే ఆ భార్గవపింపము నీ సరోవారిలో పారవైచి భృగువుపై కోపము నిష్కృతి యొనర్చి నా పులోమను దానవరాజ్యమున కెత్తుకొని పోయెదను!"

## ౧౧

అంతలో నా యరణ్యతమస్సు నంతటిని ఉద్ద్యోతింప జేయుచు తూర్పున బాలసూర్యుఁడుదయించెను. ప్రాచీదిగంగన దివాకరుని బ్రసవించిన క్షణముననే కుక్షిచ్యుతుఁడై పులోమాదేవిగర్భమునుండియు అగ్నితేజస్కుఁడగు నర్భకుఁడు భూమిపై బడి రోదనము చేయ నారంభించెను.

అంతవరకు మిగిలిన దస్యులతో తొలఁగి విశ్రమించుచున్న పులోమదానవుఁ డా రోదనధ్వని వినగానే ఉత్కంఠతో లేచెను. వెంటనే ఆ బాలకుని నీటిలో పారవేసి కసి తీర్చుకొనవలె నను నాతురముతో వాఁడు దస్యుపరివృతుఁడై అటువైపు వచ్చుచుండెను. గర్భచ్యుతుఁడైన యా బాలకుని రూపము పులోముని కన్నుల బడెను.

ఆ బాలుని తేజస్సు చూచి పులోముని కన్నులు మిరుమిట్లు గొనెను. ఆక్షణముననే వింతగా నా శిశువుసమీపమునుండి పుట్టి యొక యగ్ని పులోమాదిదస్యు లున్న వైపుకు ప్రసరించెను. అది మహాదావాగ్నియై ఒక్కక్షణములో నా వచ్చుచున్న పులోముని, అతనివెంట నున్న దస్యులను నిర్విశేషముగా దహించెను. అది చూచి వనపక్షు లైతాళికు లట్లు గానముచేసిరి:

"సముదితసూర్యసహస్రో
పమమస్యాభా తేజా, జగము పట్ల వసముగా
సమదీ ప్తి తీవ్రపావక
నను జూచుచు నసుర ధస్మసాత్కృతు డయ్యెక్!"

మాతృకుక్షిభ్రష్టమగు వనస్థలిలో నున్న పులోమాదేవికి ఆ సూర్యప్రభుఁడైన బాలకుని జూచినంతనే దేహమున నూతనశక్తి ప్రాదుర్భూత మయ్యెను. ప్రక్కనున్న దస్యుకాంత దంతములతో కొరికి యా బాలుని నాభిచ్ఛేదము చేసినంతనే పులోమ యా పిల్లవానిని తన యొడిలోనికి జేర్చుకొనెను. తన సమీపముననే పుట్టి యా కానన మెల్ల దహించుచున్న యా దావాగ్ని కామె యింతయు చలింపలేదు. భృగుపుత్రుని ఒడిలో ధరించిన యానంద మామెను విరతశయనిర్భయస్థితి చేకూర్చెను. ఆ దావాగ్నికి వగచుకొక్క మిగిలిన వారామెయు, ఆమె పిల్లవాఁడును, అతని నాభిచ్ఛేద మొనర్చిన యా దస్యువనితయు మాత్రమే!

ఇరువది యొక్క దినములు లా పులోమాసాధ్వి పుత్రమాత్రసహచరియై యా దస్యుకాంత చేయు నుపచర్య లందుచు ఆ పర్వతశ్రేణి యందలి ఆ అరణ్యమధ్యమున ఆ సరోవరతీరమున నివసించెను. ఆమెకు జ్ఞాతపూర్వములగు కందమూలములతో నామె శరీరధారణ చేయుచు ప్రక్కనున్న సరోవారితో స్నానపానములు జరుపుచు పిల్లవానిని పోషించుకొనెను.

భృగుపుత్రుని జన్మవేళను ఉదయించి ప్రచండముగా నచ్చట నెలకొనిన దావాగ్ని కొంతకాలమున కుపశమించెను. ఆ తీవ్ర తాపమునకు విరిసిన యా పర్వతభూభాగము అది చల్లారిన పిమ్మట నెమ్మదినెమ్మదిగా బిగిసికొనిపోవ నారంభించెను. దానితో నా పర్వతసానువులు బీటలువారసాగెను. అట్టి బీటలలో నొక దాని నుండి యా సరోవరజలము పర్వతమధ్యమునుండి చిన్న జాలు చేసికొనెను. ఆ జాలు పులోమను దస్యులు తెచ్చినప్పుడు ఆమె కన్నీటితో తడిసిన మార్గముననే ప్రవహింప నారంభించెను.

పులోమాదేవి యది నిర్వర్ణించి బాలకుని ఒడిలో నిడికొని ఈమారు ఆనందబాష్పము లేకధారగా కార్చుచు ఆ జాలువెంట భృగ్వాశ్రమాభిముఖముగా మంథరగమనముతో నడువసాగెను. అది చూచి వెంటనున్న దస్యుకాంత భయపడి ఎందో పారిపోయెను.

## ౧౨

పులోమ నట్లు పులోముఁడు హరించిన నాఁడే నాటిసాయంకాలమున భృగువు కృతస్నానాదికర్మకలాపుఁడై యాశ్రమమునకు తిరిగి వచ్చి జరిగిన వృత్తాంతము తెలిసికొనెను. వెంటనే పలువురు కింకరుల బిలిపించి పులోముని దరిమి పట్టి తెచ్చుటకు పంపెను. నా నాఁటినుండి నాటి సాయంత్రము ప్రొద్దుపోయి దీనముగా తిరిగి వచ్చి పట్టుకొనలేకపోతి మనియు, ఎప్పటికప్పుడు వారి యునికి తెలియ వచ్చుచున్నను వారి వేగమును అనుగమింపలేక పోతి మనియు నివేదించిరి.

భృగువునకు కోప ముదయించెను. ఈ మూఁడు దినములును పత్నీసన్నిధి లేనందున నగ్ని లోపించెను. ఆ రాత్రి యంతయు నతఁడు కోపాయత్తచిత్తుఁడై యాలోచించెను. నాల్గవనాఁ డుదయమున పులోమరాక్షసదహనార్థము అగ్నిని మథింప నారంభించెను. ఇక్కడ నగ్ని యుత్పాదించిన క్షణముననే సరోవరతీరమున భృగుపుత్రుఁడు గర్భచ్యుతుఁ డయ్యెను. ఆ సమయముననే ఆ బాలకుని కాంతికి దావాగ్ని పుట్టి పులోమరాక్షసుని సపరివారముగా దహించివేసెను.

పులోమను రాక్షసుఁడు హరించిన పిమ్మట మాసమువరకు భృగువు నాయుధశిక్షణామాత్రవ్రతుఁడై పత్నీసమాగమము నిరీక్షించుచుండెను. నెల యగునప్పటికి తేజస్వి యగు నా బాలకుని ఒడిలో ధరించి పులోమాదేవి సరస్స్రుతమగు నా జలధారవెంట తానును కన్నీరు కార్చుచు వచ్చి భర్తకు కుమారుని దర్శించి, నమస్కరించి, నెమ్మదిగా జరిగిన వృత్తాంతము నివేదించెను.

భృగువు కోపోద్రిక్తుఁడై పత్ని నిట్లు ప్రశ్నించెను:

"అనిందితచరిత్ర వగు నిన్ను ఆ పులోమరాక్షసునికి గుర్తింప జెరిగించిన దుర్మార్గుఁ డెవరు?"

"పూజ్యుడగు నగ్నిహోత్రుడే ప్రభూ!"

"ఈ అగ్నిహోత్రుడు సర్వభక్షకుడగుగాక!"

ఆ భృగుశాపమునకు సర్వాంతర్యామి యగు నగ్నిహోత్రుడు భయచలితుడయ్యెను. అపవిత్రమగు సర్వభక్షకత్వము సహింపలేక అగ్నిభట్టారకుడు తన తేజస్సు తనలో నుపసంహరించుకొనెను. మహర్షులకు నిత్యనైమిత్తికకర్మ లుడిగెను. యజ్ఞయాగము లన్నియు లోపించెను. అగ్నితత్వము లేని కలికాలమునందువలెనే ముల్లోకములు లుప్తకర్మలై క్షోభించిపోయెను.

భృగుపితామహుడగు లోకపితామహు డది చూచి భృగువు నాశ్రమమునకు వచ్చి యగ్నిహోత్రుని పిలిచి యిట్లు వర మిచ్చెను:

"దివాకరుడు సమస్తమును స్పృశించుచున్నను తన తేజోవిశేషముచే పరమపవిత్రుడే! అట్లే నీవుకూడ సర్వభక్షకుడ వయ్యును నీ ప్రభావిశేషముచే సర్వోచితవై దేవముఖుడవు కమ్ము!"

అగ్నిహోత్రు డంతట ప్రసన్నుడై లోకములం దప్పటివలె ప్రసరించి యనుగ్రహించెను.

అక్కడ కూడిన వనమునిసురసంఘసమక్షమున లోకపితామహుడు భృగువును, పులోమను, శిశువును ఎదుట నుంచుకొని యిట్లు వెలువిచ్చి కట్టడి చేసెను:

"భృగూ!, ఈ బాలకుడు నీ గర్భచ్యుతు డగుటచే 'చ్యవను' డను నామముతో పరమతేజస్వియై కీర్తివొంది భృగువంశమును విస్తరింపజేయగలడు!

"ఆ రాక్షసుడు నిన్ను హరించి కొనిపోవునప్పుడు నీవు కార్చిన దుఃఖాశ్రువులతోడను, పరలవిముక్తుడై బాలుడు నెత్తురుకొని వచ్చుచు విడిచిన యానందబాష్పములతోను ఈ కనబడు నది పుట్టి సింధువులో కలియుచున్నది. వధూమణియగు నీ కన్నీటి ననుసరించి పుట్టి ప్రవహించు నీ నదికి 'వధూసర' యని నామకరణము చేయుచున్నాను. దీని యొడ్డునవే నీ కుమారు డీ చ్యవను డాశ్రమము నిర్మించుకొనును.

"ఈ వధూసర పశ్చిమభాగము భార్గవపత్ని దుఃఖాశ్రువులతో నపవిత్రమైనది. కాని పూర్వభాగము దాని యానందాశ్రువులతో పవిత్రమైనది. ఈ 'వధూసర' ఆర్యులకును, దస్యులకును ఇక ముందు పశ్చిమమున సరిహద్దుగా నుండగలదు!"

* * * * *

ఈ వధూసర ఇప్పుడెక్కడ నున్నదని హరికుడు ధ్యాననిమీలితలోచనుడై యొక్కక్షణ మాలోచించెను. ఇదియే ఈ కాలమున 'సింధునది' యను నామముతో జగద్విఖ్యాతమైన దని యతని విజ్ఞానచక్షుస్సుకు గోచరించెను. లోకపితామహుని శాసనముచే శిష్టులెవ్వరు నిప్పటికిని సింధునది పశ్చిమభాగమునకు దాటరు. అట్లు ప్రమాదముచేగాని, మోహముచేగాని దాటినచో తిరిగి వచ్చి సింధునది పూర్వదరిని స్నానము చేసి ప్రాయశ్చిత్తము చేసికొందురు.

